# కొండెక్కిన దీపాలు...

రచన:
"రాధేయ"

ప్రొద్దు గ్రుంకడానికి ఒక్కగంటమాత్రమే వుంది.

సూర్యుడు క్షణక్షణానికీ ఎరుపురంగు దిద్దుకొంటున్నాడు.

ఆకాశమంతా కుంకుమార్చన చేసుకున్నట్లుగా వుంది.

'మాధవ్' వడివడిగా ముందడుగు వేస్తూనేవున్నాడు. తన గమ్యమింకారాలేదు. కళ్ళకున్న చలువజోడు తీసి జేబులో వుంచుకొని ముఖంమీద పడుతున్న జుత్తును పైకి ఎగదోసుకున్నాడు. చెమటలుపట్టిన నుదుటిని కర్చీఫ్‌తో అద్దుకున్నాడు;

చీకటి పడకముందే 'రాధ'ను చేరుకోవాలి. మనసంతా విప్పి ఆమెముందు పర్చాలి. నన్ను చూడగానే 'బాబా' అక్కున చేర్చుకుంటాడు. ఏ దిక్కూలేని నన్ను చేరదీసి ఆదరించిన 'బాబా', శూన్యం ఏకాకిగా జీవించే నాకు 'నేనున్నాను' అంటూ తోడుగా నిల్చిన 'రాధ' నిజంగా నాకు రెండుకళ్ళు. ఏకంటికి బాధగల్గినా భరించలేను. అనుకుంటూ ఆత్రంగా నడుస్తూ ఆశగా, కళ్ళెత్తి చుట్టూ కలియజూస్తూ ముందడుగు వేస్తూనేవున్నాడు.

శిథిలావస్థలో నున్న వేణుగోపాలస్వామి ఆలయం అల్లంతదూరంలో దీనంగా కన్పించింది.

మాధవ్ కళ్ళు ఆనందంగా మెరిశాయ్!

దేవాలయం దగ్గర పడుతున్నకొద్దీ అదొక నిర్జన ప్రదేశంలా వున్నట్లనిపించి ఆశ్చర్యపడ్డాడు! ఒకప్పటి ఆ స్వామివైభవాన్ని అక్కడగల జనసంచారాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

ప్రజలకు దేవుడిపై భక్తి సన్నగిల్లింది కాబోలు అనుకున్నాడు. ఆలయపతనావస్థను చూస్తుండే కళ్ళు, కాళ్లులేని వారు నేలపైబడి పొర్లినట్లుగా వున్నాయి శిధిలఖండాలు కొన్ని. ఇలా అడుగడుగునా కన్పించే ఆ శిథిలసౌందర్యాన్ని చూస్తుంటే కన్నీరు మెదిలించి 'మాధవ్'కు.

ఇంతలోనే చీకటి ముసుగువడింది. పరిసరాలు మసక మసకగా అగుపిస్తున్నాయి. ఎలాగో కాళ్ళీడ్చుకుంటూ ఆలయంప్రాంగణంలోకి అడుగుపెట్టాడు. ఎటుచూసిన ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, నిలవడానికైనా చోటు లేదు. చుటూ పరికించిచూశాడు.

ఎక్కడ 'బాబా' అలికిడి లేదు.

'మాధవ్' గుండె గుభేల్‌మంది!

మరోసారి ఆశగా ఆలయం ప్రక్కనున్న చిన్న గది వైపుకు నడిచాడు. ఆ సొరంగంలాంటిగదిలో అణగారిపోయిన ఆశకు, చమురులేని ప్రమిదలా రెపరెపలాడు గుడ్డిగా వెలుగుతోంది దీపం,

సందేహం లేదు! వారిద్దరే!!

'బాబా' పురాణం చదువుతూవుంటే 'రాధ' వింటూ పరవశించిపోతూవుంటుంది కాబోలు అనుకున్నాడు.

గదికి మరింత దగ్గరగా నడిచాడు.

'బాబా' అన్నాడు తిన్నగా....

జవాబు రాలేదు

బాబా, ఈసారి గట్టిగా పిలిచాడు.

ఈసారి నిశ్శబ్దమే సమాధానమైనా, కొద్దిసేపటికి, ఎవరూ? అంటూ వణుకుతూ వచ్చింది ప్రశ్నిస్తూ.

నేనే బాబా, నీ మాదవ్‌ని! నువ్వెక్కడున్నావ్ బాబా! ఈ చీకట్లో! చెప్పు, నేనే అక్కడికి వస్తాను! ఆ చీకట్లో వారి ఆచూకి తెలియరావడంలేదు.

బాబూ, మాధవ్ నువ్వా? ఇలా రాబాబూ! నేనే లేచి వద్దామంటే వొంట్లో శక్తిచాలదు. వారంరోజులుగా ఈ మంచంలోనే పడిపోయాను. ఇలా దీపందగ్గరగా రాబాబూ! అంటూ ఆయాసముగా, ఆత్రంగా, ఆనందంగా పిలుస్తున్నాడు బాబా!

అలాగే మెల్లిగా వుడుగులో అడుగేసుకుంటూ గుడ్డిదీపం దగ్గరకి చేరుకున్నాడు మాధవ్!

కళ్ళెత్తి ఆత్రంగా తేరిపారచూశాడు మాధవ్!

ఆశ్చర్యం!! చిక్కి శల్యమై నేడో రేపో రాలిపోయే పండుటాకులా వున్నాడు బాబా.

బాబూ! మాదవ్! ఎక్కడ! రాబాబూ? ఇలా దగ్గరగా రా! అంటూ ఆత్రంగా చేతులు తడుముతూ ముందుకు చాచాడు. బాబూ! నాకసలే చూపు ఆనదు. ఆదీపం ఇలాతే, బాబూ! ఎన్నో ఏళ్ళతర్వాత నాకోసం వచ్చిన నా మాధవ్‌ను కళ్ళారా చూసుకోవాలి? అంటూంటే దగ్గరగా నడిచి మంచంమీద కూర్చొని దీపం దగ్గరగా పెట్టుకున్నాడు మాధవ్.

నా బాబూ! ఎన్నేళ్ళకు కన్పించావ్ నాయనా! ఇకపై నిన్ను చూస్తానో లేదోనన్న బాధ ప్రతిక్షణం నన్ను పీడిస్తూవుంది. అబ్బ! ఎంతగా ఎదిగావురా! అంటూ అరచేతులతో ముఖాన్ని రాస్తూవుంటే వెచ్చని కన్నీటితడిచూసి ఉలిక్కిపడ్డాడు బాబా!

బాబూ! ఛ. ఛ. ఇదేమిటి? నువ్వు ఏడుస్తున్నావా? ఏమిటీ పిచ్చి అవి మాధవ్! నువ్వూ, రాధ నాకు రెండు కళ్ళూ బాబూ! ఏకంట నీరొచ్చినా నాగుండె పిండినట్లుగా వుంది.

బాబా, ఎలా అయిపోయావ్ బాబా! దేశసేవ దేశసేవ అంటూ వెళ్ళిపోయి, ఏళ్ళతరబడి ఈ వాతావరణాన్నే మర్చిపోయి మిమ్మల్ని ఎముకలగూడు మిగిల్చాను బాబా! నా పాపానికి ప్రాయశ్చిత్తంలేదు బాబా! నేను దుర్మార్గుణ్ణి! అంటూ తల బాదుకున్నాడు మాదవ్.

లేదుబాబూ! లేదు నువ్వు అన్యాయం చెయ్యలేదు, నువ్వు వేదపుత్రుడివి. దేశరక్షణకు అవసరమైతే ప్రాణాలనైనా త్యాగంచేసే భరతమాతపుత్రుడివి బాబూ! నువ్వు దూరంగా వెళ్ళిపోయావనే బాధకంటే దేశానికి నువ్వు చేస్తున్న త్యాగానికి గర్విస్తూ, కానీ ఎప్పటికైనా నాకోసం, రాధకోసం తప్పక నువ్వు రాగలవని ఆశగా, ఆత్రంగా, కళ్ళలో వత్తులువేసుకొని ఎదురుచూస్తున్నాం బాబూ! నా సంగతి అలావుంచు. కానీ రాధ నీకోసం ఎంతగా ఎదురు చూసిందో. ఎన్ని ఉత్తరాలు రాసిందో ఆ వేణుగోపాలునికే తెలుసు. నీవింక వస్తావో రావోనని ఎదురు చూసి, చూసి కొంతకాలం ఏడుస్తూ బ్రతికింది. కానీ, ఇప్పుడు అది ఏడ్వదు. నవ్వదు. అసలు మాట్లాడితే మాట్లాడదు. బాబూ! మాదవ్! నీకు నిజం చెప్పాలంటే, రాధ శరీరం మాత్రమే ఇక్కడ వుంది. జీవం ఎప్పుడో ఆ మాదవునిలోని లీనమై పోయింది.

బా-బా, వద్దు, చెప్పకు, నేను భరించలేను.

నిజం బాబూ! నా మాట నిజం. నువ్వు పలకరించి చూడు తెలుస్తుంది అన్నాడు బాబా, ఆయాసంగా తడబడుతూ.

ఒక్కసారిగా మాదవ్ గుండెల్లో అగ్నిపర్వతాలు ప్రేలుతున్నాయ్.

చేతిలో చెయ్యేసి, నువ్వే నాప్రాణం అన్నరాధ—

కష్టాల్లోనూ, చిరునవ్వులోనూ నువ్వే నాతోడు అంటూ బాసచేసిన రాధ, తనకోసం ఎంతటి బాధనైనా ఆనందంగా భరించే రాధ, పూర్తిగా మారిపోయిందా, నన్నే మరిచి పోయిందా! అయ్యో! ఇదేమి ఘోరం! ఈ పదేళ్ళలోనూ ఇన్నిమార్పులా! భగవాన్! నువ్వున్నావా? ఉంటే నాకింత అన్యాయం జరుగుతూవుంటే చూస్తూ మౌనం వహించావా? మౌనమే నీసమాధానమా? నా రాధ మనసిక మారదా. నాతోడూ, నీడగా నావెంట రాదా!

ఆలయం గర్భగుడిలోనికి ప్రవేశించాడు మాదవ్.

వేణుగోపాలునికి ఎదురుగా శిలాప్రతిమలా కూర్చున్న రాధ, ముకుళితహస్త అరమోడ్పుకనులతో చేతులుజోడించి ఈలోకమే మరచిపోయిన రాధ—




జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

• జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
• కూల్‌టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

— తయారించువారు —

Grams : JUPITER Phone 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,
TIRUPUR - 638 602.

నిజంగా, ఈ నారాధ అవునా కాదా! లేక ఈ గర్భగుడి లోని శిలాప్రతిమా? ఇంత నిర్జీవంలా వుందేమిటి? ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ నవ్విస్తూ గెంతులువేస్తూ కమ్మని గీతాలు పాడే నారాధ ఏమైంది! ఈరాధ ఎక్కడిది! ఈ గంభీర మూర్తి ఏ శిల్పి ఖళాఖండమో?

తెల్లని పాలనురుగులాంటి చీర, అదే జాకెట్టు, శిరస్నాన మాచరించింది కాబోలు. లేక నిడుపాటికేశాలను జారుముడితో బంధించింది.

ఆ వదనంలో ఎంతటి ప్రశాంతత, ఎంతటి ప్రసన్నత! ఇలా రాధనుగురించి ఆలోచిస్తూవుంటే మాదవ్‌కు మతిపోయి నట్లనిపిస్తూవుంది.

రాధా! అన్నాడు అతిమెల్లిగా.

మౌనమే సమాధానమైంది!

నేను రాధా. నీ మాధవ్‌ని. ఈసారి కాస్త దగ్గరగాజరిగి బిగ్గరగా పిలిచాడు.

కొంతసమయం మౌనం రాజ్యమేలింది. మెల్లిగా కనురెప్పలెత్తి చూసింది. వేణుగోపాలునివైపు.

మళ్ళీ ఓక్షణం కళ్ళు మూసుకుంది.



రాధా! నేను వొచ్చాను రాధా!

పలుకకుండా కళ్ళుతిప్పి చూసింది!

చూస్తూనే ఆనందంగా ఒడిలో వాలిపోతుందనుకున్నాడు.

అదేం జరుగలేదు.

ఓక్షణం తనవైపు దీక్షగా చూసింది. ఆ చూపులో ఎలాంటిభావాలు లేవు. ఒక ప్రశాంతత తప్ప. ఎంతసేపటికీ పెదవి విప్పి పలుకదు!

నేను రాధా! నీమాధవ్! ఇలాచూడు. నే నొచ్చాను. నన్ను గుర్తుపట్టలేదా! అన్నాడు నిష్ఠురంగా!

ఆశ్చర్యపడకు మాధవ్! నేనేమీ మారలేదు! అంది.

మరెందుకిలా ముభావంగా వున్నావ్!

నాస్వామిరూపం తిలకించుటలో నిమగ్నురాలినై వున్నాను, ఇప్పు డేమాటలు నాకు విన్పించవు!

ఎవరు నీస్వామి? నన్నే మర్చిపోయావా రాధా!

అదిగో, చూడు నాస్వామి పిలుస్తున్నాడు. అదే వేణుగానం నాకు చెవుల సోకుతూవుంది.

రా...ధా...

* * *

రవిచిత్రా ఫిలింసు వారి
'పుణ్యం కొద్దీ పురుషుడు' చిత్రంలో
శోభన్ బాబు - జయసుధ.

* * *

మాధవ్, నువ్వు ఇంటికెళ్ళు. కొద్దిసేపట్లో నేనూ వస్తాను అంది నిశ్చలంగా రాధా. నిన్ను ఈపరిస్థితిలో చూస్తే నాకెంతో బాధగా వుంది.

పిచ్చివాడా, ఎందుకుబాధ! నేనేమైనా నామాటలతో వేదించానా?

అవును, నువ్వే! నాలో ఆశలు పెంచలేదు! నాతోడుగా వుంటావని మాటివ్వలేదా, నన్ను ప్రేమించలేదా? చెప్పు రాధా! చెప్పు.

ఆదంతా గతం!

అయితే రాధా! మళ్ళ నాకా అదృష్టం రాదా?

రాదు మాధవ్! అదెప్పుడో చేజారిపోయింది అంటూ ఒక్కసారిగా కళ్ళెత్తి నిశితంగా దీక్షగా చూసింది.

విశాలమైన ఆమె పాలభాగం చిరుచెమటలతో ధారలు కట్టింది. ఆచెమటతో కుంకుమ చెరిగిపోయిందనుకున్నాడు మాధవ్.

కాస్త ఆగురాధా! నొసటబొట్టు చెరిగిపోయిందేమిటి. ఉండు నేను దిద్దుతాను. గుడిలో కుంకుమకోసం చూశాడు.

మాధవ్!

ఆ కంఠంలోని కాఠిన్యానికి చలించిపోయాడు.

అది నీకు అసాధ్యమైనపని! మరచిపో! ఆంది గంభీరంగా!

అసలు నీమనసేమిటో నాకు అర్థం కావటంలేదు రాధా!

నామాటమీద దయవుంచి ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకో! ఆపైన అన్నీ తేలిగ్గా అర్థమౌతాయి!

ఇంక మారు మాట్లాడకుండా వెనుదిరిగివచ్చాడు రాధను గురించే తదేకంగా ఆలోచనతో.

బాబావున్న గదిలోనికి నడిచాడు. అలికిడిలేదు. అసలు బాబా మూలుగుకూడా చాలా తక్కువస్థాయిలో వుంది. ఆ చీకట్లో తడుముకుంటూ లోనికి నడిచాడు.

బాబా, ఎక్కడున్నావ్ బాబా! ఇదిగో నీవద్దనే వస్తున్నా! ఆ గుడ్డివెలుతురులో బాబాముఖాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు తదేకంగా చూస్తూ.

ఆ. నువ్వా బాబూ! బాబూ! మాధవ్ నన్ను మన్నిస్తావా నాయనా! నేనింక ఎంతోసేపు బ్రతకను! ఈ ముసలివాణ్ణి మన్నించు బాబూ! నీకు అపరాధం చేశాను బాబూ!

బాబా, వద్దు. అలా మాట్లాడవద్దు. నువ్వు నాకు అపరాధం చేశావా? లేదు, నువ్వు ఏనాటికీ చెయ్యవు. ప్రాణానికి ప్రాణంగా నన్ను పెంచిన నువ్వు అలా అనకు బాబా! నేను భరించలేను.



నిజంబాబూ! నన్ను నమ్మ. ప్రాణానికి ప్రాణంగా రాధా నువ్వు ప్రేమించుకున్నారని తెలుసుకోలేక నాతల్లి జీవితాన్ని చేజేతులా బుగ్గపాలు చేశానయ్యా! అంటూ బోరున విలపిస్తూ మరొకవైపు ఆయాసంగా రొప్పుతున్నాడు,

బాబా! అసలే నీ ఆరోగ్యం బావుండలేదు, నువ్వేం మాట్లాడవద్దు. నామాట విను బాబా.

లేదు బాబూ! నేను మాట్లాడాలి ఇప్పుడు. నాబాధ నీతో చెప్పుకోవాలి. తర్వాత నువ్వు క్షమించానంటే తృప్తిగా ప్రాణాలు వదులుతాను బాబూ. కానీ, మాధవ్! ఈ చేతుల్లో పెరిగి పెద్దవారైన మీరు, ఎవరికీ కాకుండా పోతున్నారు బాబూ! ఇది నేనుచేసిన తప్పేనయ్యా! ఇకనైనా నన్ను క్షమిస్తావా మాధవ్! కానీ, కానీ...మీకు ఏదారీ చూపకుండా నేనే ముందు నాదారి వెతుక్కుంటూ వెళ్ళిపోతున్నాను భగవాన్! వీరిని చల్లగా కాపాడు తండ్రీ!

బాబూ! మాధవ్! ఇలా దగ్గరగా రాబాబూ! ఆంటూ వణుకుతూ రెండుచేతుల్లో మాధవ్ ముఖాన్ని ఇముడ్చుకొని బలంవంతంగా తన రెండు కనురెప్పలెత్తి చూశాడు.


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం. 1938

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 12-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స బుక్ స్టాల్సులో దొరుకును.

* కథాంజలి *

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 079.

రాధ ఇంకా రాలేదుకదూ! నాకు తెల్సు అది రాదు,.. అంటూనే ఆకళ్లు శాశ్వతంగా మూతపడ్డాయి

బా...బా...అంటూ దిక్కులన్నీ ప్రతిధ్వనించే వెర్రిగా అరిచాడు మాధవ్! అక్కడే కుప్పగా కూలిపోయాడు.

వెంటనేలేచి ధైర్యం తెచ్చుకొని గబగబా గుడివైపుకు నడిచాడు మళ్ళీ!

అక్కడే, రాధ...అదే చిరునవ్వు! అదే మొండివైఖరి.

రాధా, రాధా! మనతాత వెళ్ళిపోయాడు రాధా అన్నాడు గుడిలోనికి అడుగుపెడుతూనే...

మౌనమే సమాధానమైంది!

పలుకవేల రాధా! మనల్ని కంటికి రెప్పలా పెంచిన తాత ఇంకలేదు రాధా...

ఊసారీ అంతే!

ఈసారి మాధవ్‌కు ఒక్కసారిగా కోపం పెల్లుబికింది. చేసేదిలేక రెండుభుజాలపైన చేతులుకొని ఆకళంగా తన వైపుకు త్రిప్పుకున్నాడు.

అంతే! నిర్జీవి రాధ, ప్రతిమలా బిగుసుకుపోయింది.

రా...ధా, అంటూ ఈసారి నిజంగానే పిచ్చివా డయ్యాడు మాధవ్! ఈపిలుపు ఎంతదూరందాకా ప్రతిధ్వనించిందో ఆ ప్రేమికులకే తెలుసు.

నువ్వూ నన్నువిడిచి వెళ్ళిపోయావా రాధా! ఇంకా నాకీలోకంలో ఎవరున్నారు? నే నెవరికోసం జీవించాలి!

ఓహో! ఈ రాతిదేవు డున్నాడు కదూ!

వీడే నన్నిలా మార్చింది! వీడే తనజీవితాలను ఇలా వేరుచేసింది అంటూ వేణుగోపాలుని కసితీరా తిడుతూ అంతటితో ఆగక విగ్రహాన్ని అకళంగా అటూ యిటూ తిప్పుతూ పగులగొట్టాలని ప్రయత్నించబోతే, ఆ విగ్రహం పాదాలక్రిందనుంచి ఓ చీటి జారిపడింది.

ఆత్రంగా తీసుకున్నాడు చేతుల్లోకి.

మాధవ్-

నీకోసం ఎంతగానో నిరీక్షించాను! నీవు వెళ్ళింది మొదలు మళ్ళీ ఈచాయలకే రాలేదు. నామదిలో నీకుతప్ప అన్యులకు చోటులేదు అనుకుంటూ చాలాకాలం ఎదురు చూశాను నీకోసం. కానీ లాభంలేకపోయింది. అసలు నీ ఉనికికూడా తెలియరాలేదు. మనదేశంమీద విదేశీయుల యుద్ధం మొదలైనట్లు వార్తలద్వారా విన్నాను. ఎంతోమంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లుగా విన్నాను! నిన్ను గురించి దిగులుగా నువ్వు నాకోసమైనా ఎక్కడో ఒకచోట బ్రతికివుంటావని, ఎప్పటికైనా నాకోసం వస్తావని ఎదురు చూశాను. ఫలితం లేకపోయింది! తాత తృప్తికోసం మరొకరి ఇల్లాలినైనాను. కానీ ఏడాది తిరక్కముందే నా నుదుటిబొట్టు చెరిగిపోయింది. తరువాత తాతకోసమే నా శేషజీవితమనుకుంటూ జీవిస్తూవచ్చాను. ఆ మాధవునికి సర్వస్వం అర్పించాను! ఇంతలో నువ్వు వచ్చావు! నిన్ను చూశానన్నతృప్తి నాకు కల్గింది!

అందుకే ఇంక నా మాధవుని చేసుకొంటున్నాను! నా స్వామితోనే ఐక్యమౌతున్నాను ... నన్ను మన్నించు మాధవ్ !

ఇట్లు,

**"రాధ."**

Bajaj® DR EGYPTIAN

BAJAJ KNITTERS.S.INDIA.

మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాసీర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్ లాక్ * ఓపిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* కైరాజ్ * రాకెట్

ఇవికాక ర జెట్టీలు ర లండన్ ర న్మిట్రా ర బాబి అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు అన్ని ప్రముఖ బట్టల షాపులోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.